ప్రజాశక్తి
మంగళవారం 28 మే 2024 | 5 | అనంతపురం

కౌంటింగ్‌పై వందశాతం దృష్టి

◆పనులన్నీ వేగవంతం చేయాలి

◆కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికల కౌంటింగ్‌పై ప్రతి ఒక్కరూ వంద శాతం ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సాధారణ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు, తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన పనులన్నింటినీ వేగవంతం చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రం రిటర్నింగ్ అధికారుల నియంత్రణలో ఉండాలన్నారు. కౌంటింగ్‌ను సజావుగా నిర్వహిస్తామనే నమ్మకం ప్రతి ఒక్కరికీ ఉండాలన్నారు. కౌంటింగ్ పర్సనల్ 2వ ర్యాండమైజేషన్ ప్రక్రియను జూన్ 2వ తేదీ నిర్వహించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రణాళిక ప్రకారం బ్యారికేడింగ్ ఏర్పాటు ఉండాలన్నారు. కౌంటింగ్‌కి సంబంధించి అభ్యర్థికి, ఏజెంట్‌కి కౌంటింగ్ తేదీ, సమయం తెలియజేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మీడియా సెంటర్ ను, టీంలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలోనూ హై స్పీడ్ ఇంటర్నెట్ ఉండాలని తెలియజేశారు. బిఎస్ఎన్ఎల్, ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్లు సిద్ధంగా ఉండాలన్నారు. ఏజెంట్లకు ముందుగానే జూన్ 2వ తేదీన కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో ఐడి కార్డులను అందివ్వాలన్నారు. ప్రతి బ్లాక్‌లోనూ అబ్జర్వర్‌కి ఒక రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. అందులో ల్యాండ్ లైన్ ఫోన్, ఫ్యాక్స్, ఒక టీవీ ఉండాలన్నారు. ప్రతి ఆర్ఓ వద్ద ఒక డిప్యూటీ తహశీల్దార్, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌కు విధులు అప్పగించాలన్నారు. కౌంటింగ్ అయ్యాక ఈవీఎం సీల్ వేసేందుకు ప్రత్యేక బందం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ రిజెక్షన్స్‌కు సంబంధించి ఆర్ఓ హ్యాండ్‌బుక్‌లో కౌంటింగ్ చాప్టర్ పూర్తిగా చదవాలన్నారు. కౌంటింగ్ కోసం ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఎఫ్ఓ వినీత్ కుమార్, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

సాధారణ ఎన్నికల కౌంటింగ్‌లో సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం అని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్.వి తెలియజేశారు. అనంతపురం నగరంలోని జేఎన్టీయూ ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు – 2024లో భాగంగా కౌంటింగ్ ప్రక్రియపై సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు సోమవారం నాడు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సజావుగా కౌంటింగ్ నిర్వహించాలే అందరూ పనిచేయాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఏ రకమైన సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, రిటర్నింగ్ అధికారులు రాణిసుస్మిత, కరుణకుమారి, వి.శ్రీనివాసులు రెడ్డి, వసంతబాబు, వెన్నెల శ్రీను, రాంభూపాల్ రెడ్డి, జి.వెంకటేష్, ఈఆర్ఓ శిరీషా, నోడల్ అధికారులు రఘునాథరెడ్డి, బసవరాజు పాల్గొన్నారు.

అంతర పంటలకు సబ్సిడీ ఖరారు

కొన్నింటికి 30 .. మరికొన్నింటికి 50 శాతం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ అంతర పంటలకు సంబంధించిన విత్తన సబ్సిడీ ధర ఖరారైంది. కొన్నింటికి 30 శాతం వరకు సబ్సిడీని ఖరారు చేయగా, మరికొన్నింటికీ 50 శాతం సబ్సిడీని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే వేరుశనగ సబ్సిడీ ఖరారవడంతోపాటు రిజిస్ట్రేషన్లు, పంపిణీ ప్రక్రియ కూడా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇక అంతర్ పంటలకు సబ్సిడీ ఖరారవడంతో దీనికి రిజిస్ట్రేషన్, పంపిణీకి ఏర్పాట్లు జరగనున్నాయి.

ప్రత్యామ్నాయ విత్తన కేటాయింపులు

జిల్లాలో ప్రధాన పంట అయిన వేరుశనగతోపాటు ఇతర పంటలకు సంబంధించి విత్తన కేటాయింపులు ఇది వరకే జరిగాయి. వేరుశనగ 76,710 క్వింటాళ్లు కేటాయించగా, కంది 2,300 క్వింటాళ్లు, మినుములు 46 క్వింటాళ్లు, పెసలు 85 క్వింటాళ్లు, రాగి నాలుగు క్వింటాళ్లు, కొర్ర 50 క్వింటాళ్లు, వరి 1600 క్వింటాళ్లు, దాంచియ 200 క్వింటాళ్లు, పిల్లిపెసర 25 క్వింటాళ్లు, ఉలవలు 700క్వింటాళ్లు, అలసందలు 106 క్వింటాళ్ల కేటాయింపులు జరిగాయి.

కొన్నింటికి 30 శాతం సబ్సిడీ...మరికొన్నిటికీ 50 శాతం

మినుములు పూర్తి ధర క్వింటాళు రూ.14 వేలు ధర నిర్ణయించగా రూ.4200 సబ్సిడీని ప్రభుత్వం ఖరారు చేసింది. అంటే 30 శాతం సబ్సిడీతో అందజేనున్నారు. పెసలు ధర క్వింటాళు రూ.13 వేలు అయితే 30 శాతం సబ్సిడీ ప్రకారం రూ.3900 ధర నిర్ణయించారు. కందులు పూర్తి ధర 13,980 అయితే సబ్సిడీ రూ.4194 నిర్ణయించారు. కొర్రలు పూర్తి ధర క్వింటాళ్లు రూ.8740 కాగా సబ్సిడీ 50 శాతం కేటాయించారు. రాగిది అదే పరిస్థితి పూర్తి ధర క్వింటాళు రూ.7250 అయితే 50 శాతం సబ్సిడీతో క్వింటా ధర రూ.3625గా నిర్ణయించారు. వరి బిపిటి, ఆర్ఎన్ఆర్ రకం విత్తనం క్వింటా పూర్తి ధర రూ.4180 అయితే సబ్సిడీ జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద వెయ్యి రూపాయలు సబ్సిడీ కేటాయించగా నాన్ ఎన్ఎఫ్ఎస్ఎం కింద క్వింటాళుకు రూ.500 కేటాయించారు.

ఒక్కో రైతుకు గరిష్టంగా ఇలా ...

వరి విత్తనం 25 కిలోలు, 30 కిలోల బస్తాలున్నాయి. అర ఎకరంలోపు నుంచి ఒకటిన్నర ఎకరాలోపు వరకు ఒక బస్తాయే పంపిణీ చేస్తారు. ఒకటిన్నర ఎకరా నుంచి మూడు ఎకరాల్లోపు అయితే మూడు బస్తాలిస్తారు. మూడు ఎకరాల నుంచి నాలుగు ఎకరాల వరకు మూడు బస్తాలిస్తారు. నాలుగు ఎకరాల పై నుంచి గరిష్టంగా నాలుగు బస్తాల విత్తనం ఇస్తారు. కంది, మినుము, పెసర నాలుగు కిలోల ప్యాకెట్లు ఇస్తారు. అర ఎకరంలోపు అయితే ఒక ప్యాకెట్ సబ్సిడీతో ఇస్తారు. అర ఎకరం నుంచి ఎకరాలోపు అయితే రెండు ప్యాకెట్లు, ఒకటి నుంచి ఒకటిన్నర వరకు మూడు ప్యాకెట్లు, ఒకటిన్నర నుంచి రెండు ఎకరాల్లోపు నాలుగు ప్యాకెట్లు, రెండు నుంచి రెండున్నర ఎకరా వరకు ఐదు ప్యాకెట్లు, రెండున్నర నుంచి మూడు వరకు ఆరు ప్యాకెట్లు, మూడు నుంచి మూడున్నర వరకు ఏడు ప్యాకెట్లు. మూడున్నర నుంచి నాలుగు ఎకరాల వరకుంటే ఎనిమిది ప్యాకెట్లు, నాలుగు నుంచి నాలుగున్నర ఎకరాల వరకయితే తొమ్మిది ప్యాకెట్లు, ఆపైన ఎంతున్నా పది ప్యాకెట్లు గరిష్టంగా సబ్సిబీతో పంపిణీ చేయనున్నారు. కొర్ర, రాగులు రెండు కిలోల ప్యాకెట్లు ఒక కిట్‌గా ఇస్తారు. ఇది కూడా ఎకరంలోపు అయితే ఒక ప్యాకెట్, ఎకరా నుంచి రెండు ఎకరాల వరకయితే రెండు ప్యాకెట్లు. గరిష్టంగా ఐదు ప్యాకెట్లను ఇస్తారు.

వేరుశనగ కూపన్ కొట్టు... వెయ్యి పట్టు..!

◆పక్కదారి పడుతున్న సబ్సిడీ వేరుశనగ

◆కాజేసేందుకు దళారులు, వ్యాపారుల కుట్ర

సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్ ఫొటో)



ప్రజాశక్తి-నార్పల

ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ వేరుశనగ నార్పలలో పక్కదారి పడుతోందనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. సబ్సిడీ కూపన్ కొట్టు.. వెయ్యి పట్టు అన్నచందంగా ఈ వ్యవహారం నడుస్తోంది. నార్పల మండలంలో ఖరీఫ్ సాగుకు 8542 ఎకరాల సాగు ఆధారితంగా సబ్సిడీ వేరుశనగ పంపిణీకి కె6 రకం 1900 క్వింటాళ్లు వచ్చింది. క్వింటాల్ పూర్తి ధర రూ.9500 కాగా సబ్సిడీ రూ.3800 పోగా రైతు వాటా రూ.5700 చెల్లించాల్సి ఉంది. ఒక్కొక్క రైతుకు గరిష్టంగా ఒక ఎకరానికి మూడు బస్తాలు ఇవ్వనున్నారు. ఒక బస్తా ధర రూ.2850 కాగా సబ్సిడీ రూ.1140 పోగా ఒక బ్యాగుకు రైతు రూ.1710 చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన పంపిణీ కొనసాగుతోంది. మండల వ్యాప్తంగా 1800 మంది రైతులు ఇప్పటికే విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో 1472 మంది రైతులకు శుక్రవారం నాడు మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ గోడౌన్లలో 1375 క్వింటాళ్లు అందజేశారు. మిగిలిన వారికి శనివారం అందించారు. ప్రస్తుతం వచ్చిన స్టాక్ అయిపోయిందని రాగానే రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో వేరుశనగ కాయలకు డిమాండ్ అధికంగా ఉంది. భవిష్యత్తులో మరింత డిమాండ్ పెరిగే అవకాశం కన్పిస్తుండడంతో సబ్సిడీ వేరుశనగపై దళారులు, వ్యాపారుల కన్ను పడింది.

పక్కదారి పట్టిస్తున్న దళారులు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విత్తన కాయలు తీసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతుల పట్టాదారు పాసుపుస్తకం ఆధార్ కార్డు, తీసుకెళ్లి వేలిముద్ర వేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే రైతు భూమిని బట్టి అక్కడే డబ్బులు కట్టించుకుని కూపన్లను సంబంధిత సిబ్బంది ఇస్తున్నారు. ఈ కూపన్ తీసుకెళ్తే విత్తన వేరుశనగ పంపిణీ కేంద్రంలో సబ్సిడీ విత్తనకాయలను అందిస్తారు. ఇంతవరకు అంతా బాగానే ఉన్నా నార్పల మండలంలో సబ్సిడీ వేరుశనగ కోసం దళారులు రంగప్రవేశం చేశారు. రైతులకు మాయమాటలు చెప్పి కూపన్ ఇస్తే వెయ్యి రూపాయలు ఇస్తామంటూ ఆశ చూపి వారితో వాటిని తీసుకుంటున్నారు. ఇలా కొందరు దళారులు ఇప్పటికే మండల వ్యాప్తంగా భారీ ఎత్తున సబ్సిడీ విత్తన వేరుశనగ బస్తాలను సేకరించినట్లు తెలుస్తోంది. వేరుశనగ వ్యాపారులు, మిల్లర్లతో కుమ్మక్కై ప్రభుత్వం నుంచి సబ్సిడీ ధరకు తీసుకున్న వేరుశనగ విత్తన కాయలను అదనంగా రూ.4 నుంచి రూ.5 వేల వరకు లాభంతో అమ్ముకుంటునట్లు సమాచారం. కొందరు వ్యాపారులు వేరుశనగ కాయలు ఆడించి విత్తనాలు నిల్వచేసి విత్తనాలు వేసే కాలంలో అధిక ధరకు విక్రయిద్దామే ఆలోచనలో ఉన్నారు.

అధికారులకు తెలిసినా కూడా...

రైతులకు గోడన్‌లో విత్తన కాయలు నిల్వ లేదని చెప్పే అధికారులు దళారులకు మాత్రం కూపన్లు చూపించగానే ఇచ్చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకరకంగా విత్తన కాయలు తీసుకునే ప్రాంతంలో రైతుల కంటే దళారులే ఎక్కువగా కన్పిస్తున్నారు. కూపన్లు తెచ్చిన వారు దళారులని అధికారులకు తెలిసినా వారికి ఇచ్చేస్తున్నారు. దళారులతో అధికారులు కుమ్మకై సబ్సిడీ విత్తన కాయలను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సబ్సిడీ వేరుశనగ దళారుల పాలుకాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం..

నార్పల మండలంలో ఎక్కడైనా సబ్సిడీ విత్తన కాయలు భారీ మొత్తంలో నిల్వ ఉంచినట్లు ఎవరైనా సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం. అర్హులైన రైతులకు సబ్సిడీ విత్తన కాయలు అందించేలా కృషి చేస్తున్నాం. వీటిని పక్కదారి పట్టించే దళారులు, వ్యాపారులపై పోలీసుల సాయంతో చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మలివిడత విత్తన పంపిణీ చేపడతాం.

చెన్నవీర,
మండల వ్యవసాయ అధికారి, నార్పల.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

◆కాంట్రాక్టర్ శివశంకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి ◆కలెక్టర్‌కు కార్మిక సంఘం నేతల వినతి

కలెక్టరేట్ ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు, పిఎఫ్ తక్షణమే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కరించాలని గత వారంలో కార్మికులు నిరసనలు చేపట్టారన్నారు. ఈ సమయంలో కలెక్టర్, తాగునీటి ప్రాజెక్ట్ ఛైర్మన్‌గా స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు కార్మికులంతా నిరసనలు వీడి విధుల్లోకి చేరారని తెలియజేశారు. కాగా కార్మికులు వేతనాల కోసమే కాకుండా విధులకు సంబంధించి కూడా ఇబ్బందులు పడే దుస్థితికి కాంట్రాక్టర్ శివ శంకర్‌రెడ్డి తీసుకొచ్చాడని తెలిపారు. హక్కులు అడిగినందుకు కొంత మంది కార్మికులను తొలగించామంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. నిరసన సమయంలో కార్మికులు మోటార్లు నిలుపుదల చేశారన్నారు. బలవంతంగా కాంట్రాక్టర్ మోటార్‌లు ఆన్ చేయడంతో ఎన్ఆర్‌వి లేనందు వల్ల పైపులు పగిలి తాగునీరు వృథా అయ్యిందని తెలిపారు. ఈ సమస్యకు కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డి కార్మికులను బాధితులుగా చేసి అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశాడన్నారు. వాస్తవానికి కాంట్రాక్టర్ వద్ద సరిపడా యంత్రాలు లేవన్నారు. లీకేజీలను అరికట్టేందుకు కూడా పరికరాలు లేవన్నారు. వీటిని గుర్తించకుండా కాంట్రాక్టర్ కార్మికులను బాధ్యుతలను చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాల్లో కోతలు విధించారని తెలిపారు. కొందరిని తొలగించామంటూ పనులు రావొద్దంటూ బెదిరింపులు, వ్యక్తిగత దూషణలతో దుర్భాషలాడుతున్నారన్నారు. తక్షణం అధికారులు స్పందించి కాంట్రాక్టర్ శివశంకర్‌రెడ్డిని బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. బకాయి వేతనాలు, పిఎఫ్, చెల్లించాలన్నారు. 16 మంది కార్మికులకు 4 నెలల వేతనాలు చెల్లించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ కార్మికులవి న్యాయమైన సమస్యలే అని, ఎన్నికల ఫలితాలు పూర్తవ్వగానే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా నాయకులు మల్లికార్జున, ఐఎఫ్‌టియు నాయకులు ఏసురత్నం, శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి, రాష్ట్ర నాయకులు కొండారెడ్డి, నాయకులు హరిష్, నరేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాతాజీ రామ్‌బాయి అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

అంబేద్కర్ ఆశయ సాధన కోసం అహర్నిశలు కష్టపడి జీవితాన్ని త్యాగం చేసిన ఆదర్శమూర్తి మాతాజీ రామ్‌బాయి అంబేద్కర్ అని వక్తలు కొనియాడారు. స్థానిక ఆర్‌డిటి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు రాజన్న ఆధ్వర్యంలో అంబేద్కర్ భార్య మాతాజీ రామాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ మీ తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని వారి శ్రమను గుర్తించి ఉన్నత చదువులు చదివి మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, నర్సింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవ సమితి పదవులకు రాజీనామా

రాయదుర్గం : రాయదుర్గం వినాయక ఉత్సవ సమితి కమిటీ బాధ్యతలకు రాజీనామా చేసినట్లు సమితి ఉపాధ్యక్షులు తట్టే నగేష్, ప్రధాన కార్యదర్శి దేవి రెడ్డిపల్లి రాజేష్, సహ కార్యదర్శి ఎం.మల్లికార్జున, అధికార ప్రతినిధి మద్దిలేటి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఇట్ట గిరీష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది హిందూ మహాగణపతి ఉత్సవాలను వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వైభవం గా నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ ఏడాది వినాయక ఉత్సవాలను మరింత వైభవంగా జరిపేందుకు నూతన కమిటీ ఏర్పడితే బాగుంటుందనే ఉద్దేశంతో కొత్తవారికి అవకాశం ఇవ్వడంతో పాటు పారదర్శకంగా వ్యవహరించినట్లు అవుతుందని తాము తమ బాధ్యతలకు రాజీనామా చేశామ న్నారు

అంధకారంలో ఎన్టీఆర్ కాలనీ..!

8 ఏళ్లయినా విద్యుత్ సరఫరాకు నోచుకోని వైనం

ఎన్టీఆర్ కాలనీ

బొమ్మనహాల్ : మండల కేంద్రమైన బొమ్మనహాల్ శివారులోని ఎన్టీఆర్ కాలనీ ప్రజలు నేటికీ అంధకారంలోనే జీవనం సాగిస్తున్నారు. 8 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 150 మంది నిరుపేదలకు ఈ ప్రాంతంలో ఇంటి పట్టాలు మంజూరు చేయగా చాలా మంది ఇళ్లు నిర్మించుకున్నారు. అప్పట్లోనే తాగునీటి పైపులైన్ కూడా చేశారు. ప్రస్తుతం 60 కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే ఇప్పటికీ ఆ కాలనీకి విద్యుత్ సరఫరా లేదు. దీనికి తోడు కాలనీ చుట్టూ దట్టమైన ముళ్ల పొదలు ఉండడంతో విషపురుగుల బెడదతో రాత్రివేళ గడప దాటి అడుగు పెట్టాలంటే ప్రజలు భయపడుతున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడం తో తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ లైన్ లాగి విద్యుత్ దీపాలు చేయడంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

వైభవంగా ప్రసన్న వెంకటరమణస్వామి రథోత్సవం

అశేష భక్తజన సందోహం మధ్య ప్రసన్న వెంకటరమణస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి రథోత్సవం సోమవారం అశేష భక్త జన సందోహం మధ్య భక్తుల గోవింద నామస్మరణతో అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి ఆలయం వద్ద నుంచి తీసుకొచ్చి మేళతాళాలతో ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ హోమాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వినాయక కూడలి వరకూ మడుగుతేరు లాగారు. సాయంత్రం వినాయక కూడలి నుంచి నేసే పేటలోని భక్త మార్కండేయ స్వామి ఆలయం వరకూ రథం లాగారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం తేరుబజారు వరకూ బ్రహ్మ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, ఆలయ కమిటీ అధ్యక్షులు గౌని పాలాక్షిరెడ్డి, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి నరసింహారెడ్డి, పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, మున్సిపల్ మాజీ ఛైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, వైసిపి యువ నేత మెట్టు విశ్వనాథరెడ్డి, పాలకమండలి సభ్యులు స్వామి వారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు. బ్రహ్మరథోత్సవం సందర్భంగా ఆలయంలో స్వామి వారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడి చెల్లించుకున్నారు. రాయదుర్గం పట్టణంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన అనేక మంది భక్తజనం రథోత్సవంలో పాల్గొన్నారు.

నీరు వృథా చేయొద్దు

ప్రజాశక్తి - కూడేరు

ప్రతిమనిషికి జలం జీవనాధారమని అలాంటి నీటిని వృథా చేయొద్దని అనంతపురం నగరంలోని పివికెకె ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తెలిపారు. కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులో భాగంగా కళాశాలకు చెందిన బిటెక్ విద్యార్థులు డి. లిఖిత్, బి. మధు మండలంలోని కరుట్లపల్లి గ్రామంలో తాగునీరు గురించి నీటి వృథా వల్ల కలిగే నష్టాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మన సాధారణ జీవనశైలిలో తాగునీరు నిత్యావసరమని అన్నారు. నీటివృథా వల్ల కలిగే నష్టాలను వివరించారు. నీటి పొదుపు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఓబుళమ్మతో పాటు సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై సచివాలయ అధికారులతో మాట్లాడుతున్న పివికెకె విద్యార్థులు

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఒ సాజిదాబేగం సూచించారు. మాసిక మహోత్సవంలో భాగంగా సోమవారం మండలం కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో కిశోర బాలికలకు రుతుక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు రక్తహీనత లేకుండా బలమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. రోజూ గుడ్డు తీసుకోవాలన్నారు. తర్వాత రుతుక్రమంలో వాడే వస్తువులపై అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాలు చేయరాదన్నారు. బాల్యవివాహాలు చేస్తే కలిగే అనర్థాలను వివరించారు. కావున మహిళలకు 18ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలక్ష్మి, బిపిఎల్ పల్లవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR) ANANTAPURAMU.
DISPUTE No. DRA/CFS/132/2023.
Between:
KAPIL CHITS HYDERABAD PVT.LTD., Anantapuramu Represented by its Legal Officer,
... DISPUTANT
AND
D.NAGENDRA & 1 Other
... OPPONENTS
NOTICE TO OPPONENTS No.1
Op.1. Dandu Nagendra, S/o.Rangaiah, Hindu Aged about 60years, Occ: Business, Residing at D.No.4-21, B.C.Colony, Mulakalapenta (V), Konganapally, Guntakal(M), Anantapuramu District. (Pin -515401)
Where as the Disputant Chit Fund Company, in the above Dispute has instituted the above Dispute for recovery of money for Rs.29,961/- and the same is posted for your appearance in the said Court on the 19-06-2024 by 11:00 a.m. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparte.
(By Order of Deputy Registrar of chits O/o of the District Registrar, Registration and Stamps Dept. D.No.6-3-134, Ist Floor, Ram Nagar,Anantapuramu)

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR) ANANTAPURAMU.
DISPUTE No. DRA/CFS/57/2023.
Between:
KAPIL CHITS HYDERABAD PVT.LTD., Anantapuramu Represented by its Legal Officer,
... DISPUTANT
AND
Y.VENKATESH & 2 Others
... OPPONENTS
NOTICE TO OPPONENTS No.1 to 3
Op.1. Y.Venkatesh, S/O.Y.Anjanaiah, Hindu, A/a.60 Years, Working As Hostal Welfare Officer, B.C.Boys Hostal, Kanaganapalli (P&M), Sri Satya Sai (Dt). R/at. D.No: 18-2-83, Rajahamsa Residency, Anantapuramu (D)
Op.2. C.Ramesh,S/O. C.Lakshminarayana, Hindu, A/a. 39 Years, Working As Manager In Kapil Chits Hyd Pvt Ltd At Anantapur-1 Branch, Raghuveera Towers, Anantapuramu(P&Dt).
Op.3. M.Radhika, D/O.M.Muralidhar, Hindu, A/a. 43 years, Worked Accounts Officer in Kapil Chits Hyd Pvt Ltd, Anantapur-1 Branch, Subash Road, Anantapuramu (D)
Where as the Disputant Chit Fund Company, in the above Dispute has instituted the above Dispute for recovery of money for Rs.9,127/- and the same is posted for your appearance in the said Court on the 19-06-2024 by 11:00 a.m. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparty.
(By Order of Deputy Registrar of chits O/o of the District Registrar, Registration and Stamps Dept. D.No.6-3-134, Ist Floor, Ram Nagar,Anantapuramu)

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR) ANANTAPURAMU.
DISPUTE No. DRA/CFS/133/2023.
Between:
KAPIL CHITS HYDERABAD PVT.LTD., Anantapuramu Represented by its Legal Officer,
... DISPUTANT
AND
S.MASOOD VALLI & 2 Others
... OPPONENTS
NOTICE TO OPPONENTS No.1 to 3
Op.1. Syed Masood Valli, S/o. Late S.Masood Sab,Muslim Aged about 58years, Occ: Business, Residing at D.No.8-402,Potti Sreeramulu Colony, Anantapuramu City and District.
Op.2. C.Ramesh, S/o.C.Lakshmi Narayana, Hindu Aged about 39years, Occ: Private Employee, D.No.15-283, 2nd Floor, GLN.Complex, Kala jyothi Circle, Dharmavaram (M), Sri Sathya Sai District.
Op.3. A.Hafeez Khan,S/o.A.Mahaboob Khan, Musilim Aged about 39years, Occ: Private Employee, D.No.15-283, 2nd Floor, GLN.Complex, Kala jyothi Circle, Dharmavaram, Sri Sathya Sai District.
Where as the Disputant Chit Fund Company, in the above Dispute has instituted the above Dispute for recovery of money for Rs.12,349/- and the same is posted for your appearance in the said Court on the 19-06-2024 by 11:00 a.m. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparty.
(By Order of Deputy Registrar of chits O/o of the District Registrar, Registration and Stamps Dept. D.No.6-3-134, Ist Floor, Ram Nagar, Anantapuramu)

90 శాతం సబ్సిడీతో విత్తనకాయలు ఇవ్వాలి

సిపిఎం ఆధ్వర్యంలో వినతులు

ప్రజాశక్తి-శింగనమల

90శాతం సబ్సిడీతో నాణ్యమైన వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌లో వర్షాభావంతో రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. కరువు పరిస్థితులను పరిశీలించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలోని 29 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాయన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు విత్తనకాయలు కొనలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. కావున ప్రభుత్వం జిల్లాలో సాగు పెంచేందుకు 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగకాయలను పంపిణీ చేయాలన్నారు. కందులు, పెసలు, అలసందలు, ఆముదం, జొన్న, సజ్జ, కొర్ర వంటి విత్తనాలను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుంకన్న, సూర్యప్రకాష్, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, కుళ్లాయప్ప, నాగేంద్రస్వామి, ఆంజనేయులు, పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : 90 శాతం సబ్సిడీతో విత్తనకాయలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్

గుంతకల్లులో వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

రైతుసంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రకాల విత్తనాలను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. ముఖ్యంగా కందులు, కొర్రలు, సోయాచిక్కుడు, పత్తి, మొక్కజొన్నలు, వేరుశనగ, జనుము, పిల్లిపెసర, తదితర విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే నకిలీ విత్తనాలను అరికట్టాలన్నారు. అంతేగాకుండా దుకాణాల్లో అమ్మే పత్తి విత్తనాలన్నిటికీ రైతులకు రసీదులు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి, అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి రమేష్, రైతులు నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, రామాంజనేయరెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

గుంతకల్లు : ప్రభుత్వం రైతులకు 90 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల పంటలు నష్టపోయి రైతులు అప్పులపాలు అయ్యారన్నారు. ఈ పరిస్థితుల్లో కనీసం విత్తనకాయలు కొనలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కావున ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగకాయలు, ఉచితంగా కందులు, పెసలు, అలసందలు, ఆముదం, జొన్న వంటి విత్తనాలను అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే నాణ్యమైన విత్తనకాయలను సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనుబంధ రైతుసంఘం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, నాయకులు జగ్గలి రమేష్, కసాపురం రమేష్,సాకే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : 90 శాతం రాయితీతో వేరుశనగ విత్తనాలను ఇవ్వాలని రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పి.వెంకట రాముడు, సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఏడిఏ ఎం.వెంకటరాముడు, రెవెన్యూ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ శంకర్‌కు వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు.

నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

సాంకేతిక రంగంతో దేశాభివృద్ధి

జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

సాంకేతిక రంగం అభివృద్ధి చెందడం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ భావించారని జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా సోమవారం జెఎన్‌టియులోని పరిపాలన భవనంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌తో కలిసి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగం అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా అందరూ ప్రయత్నం చేయాలని తెలిపారు. ముఖ్యంగా పరిశోధనాత్మకంగా ఆలోచించినప్పుడే నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు. కాగా మొట్టమొదటి ప్రధాన మంత్రిగా నెహ్రూ దేశానికి సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు వి.సుమలత, భానుమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, కిరణ్మయి, సుజాత, పద్మ సువర్ణ, దుర్గాప్రసాద్, వి.బి.చిత్ర, శోభాబిందు, సురేష్‌బాబు, వైస్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణకాంతి, వర్సిటీ పిఆర్‌ఒ ఎం.రామశేఖరరెడ్డి, మాజీ ఆచార్యులు వి.శంకర్, స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి, భోధన, బోధనేతర, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలో హింసాత్మక ఘటనలకు తావులేకుండా కౌంటింగు రోజున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎస్పీ గౌతమిశాలి జిల్లావ్యాప్తంగా పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లాలోని ఎస్ఐ, ఆపై స్థాయి అధికారులతో ఎస్పీ తన క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రస్తుతం కొనసాగుతోన్న భద్రతపై సమీక్షించారు. అలాగే కౌంటింగు రోజున ఎలాంటి చర్యలు చేపట్టాలో దిశానిర్దేశం చేశారు. కార్యాచరణ ప్రణాళికలతో జిల్లాలో ఎక్కడా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాల పట్ల ప్రత్యేక దష్టి సారించాలన్నారు. రౌడీషీటర్లు, కిరాయి హంతకులు, చెడునడత కల్గిన వారిని, సమస్యలు సృష్టించే ట్రబుల్ మాంగర్స్‌ను వదలకుండా బైండోవర్లు చేయించాలన్నారు. ఇదివరకే కేసులు ఉండి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘర్షణలకు దిగిన వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేయాలని ఆదేశించారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్లు పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఆయా గ్రామాల్లోని తాజా పరిస్థితులపై సమాచారం సేకరించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లాగ్‌మార్చ్‌లు, కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు, వాహనాల తనిఖీలు, గ్రామసభలు నిర్వహించడం విస్తృతం చేయాలన్నారు. డ్రోన్లు వినియోగించి ఫలితాలు వెల్లడయ్యాక విజయోత్సవ ర్యాలీలు నిర్వహించే వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి : దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మాట్లాడుతున్న దగ్గుపాటి ప్రసాద్

జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌లో ప్రత్యేక దృష్టి సారించి అప్రమత్తంగా ఉండాలని అనంతపురం అర్బన్ దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. సోమవారం టిడిపి అర్బన్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఏజెంట్ల విషయంలో మనం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నామో అంతకు మించిన జాగ్రత్తలు కౌంటింగ్‌లో ఉండాలన్నారు. ఏజెంట్‌లు ఎవర్ని నియమించాలన్న దానిపై కూడా చర్చించారు. ఏజెంట్లకు అన్ని నియమనిబంధనలు తెలిసి ఉండాలన్నారు. కౌంటింగ్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మనకు చాలా ముఖ్యమన్నారు. ప్రతి 500 ఓట్లకు ఒక టేబుల్ ఉంటుందని, అనంతపురం అర్బన్ నియోజకర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. మనకు టేబుల్స్ ఎక్కువగా ఏర్పాటు చేస్తారన్నారు. అందుకే అన్ని టేబుల్స్‌కు ఏజెంట్లు ఉండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఇన్ వాలిడ్ ఎక్కువగా ఉంటాయని, దీనిపై పూర్తి అవగాహనతో మనం ఉండాలన్నారు. రెండు మూడు రోజుల్లో ఏజెంట్ల జాబితా సిద్ధం చేద్దామన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఇవ్వాలి

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూను పాటించాలని మండల విద్యాశాఖాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పున్ణ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు భోజనాలు చేయడానికి ఏమైనా అసౌకర్యాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్ధారించిన మెనూ ప్రకారం ఏ వారానికి ఆవారం కచ్చితంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. ఎవరైనా మెనూ పాటించకపోయినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు, ఎంఆర్‌సి సిబ్బంది శాంత, ప్రకాష్‌రెడ్డి, సునీత, విష్ణువర్ధన్‌రెడ్డి, కస్తూరిబా గాంధీ పాఠశాల అకౌంటెంట్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

హుషారుగా వేసవి శిక్షణ శిబిరం

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారు హుసారుగా ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటుతున్నారు. వేసవి శిక్షణ శిబిరం సోమవారం 13వ రోజుకు చేరుకున్నాయి. జిల్లా గ్రంథాలయం సంస్థ కార్యదర్శి పి.రమా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పిల్లలు యోగా, డ్రాయింగ్, కథలు, పద్యాలు చెప్పడం, పుస్తక పఠనం, డ్యాన్స్ వంటి పోటీల్లో ఎంతో చురుకుగా పాల్గొని అలరించారు. ఈ కార్యక్రమంలో సహాయ గ్రంథాలయ అధికారి ఇంతియాజ్ అహమ్మద్, కావేరి, ముత్యాలమ్మ, ఉజ్జినేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు పైప్‌లైన్ ఏర్పాటు

వజ్రకరూరు : విడపనకల్లు మండల పరిధిలోని వి.కొత్తకోట శ్మశాన వాటికలో సర్పంచి తిమ్మరాజు ఆధ్వర్యంలో కొత్త పైప్‌లైన్ వేశారు. ప్రజల సౌకర్యార్థం పైప్‌లైన్ ఏర్పాటు చేసి ట్యాంక్ నిర్మించి నీటి వసతి కల్పించినట్లు సర్పంచు తెలిపారు. దీంతోపాటు శ్మశాన వాటికలో కంపచెట్లు తొలగిస్తున్నట్లు తెలిపారు.

హమాలీ కాలనీలో వర్షం నీరు తొలగించాలి

సిపిఎం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-వజ్రకరూరు

ధర్నా చేస్తున్న సిపిఎం, కాంగ్రెస్ నాయకులు

ఐదు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు స్థానిక హమాలీకాలనీలో చేరుకున్న వర్షం నీటిని తొలగించాలని సిపిఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐదురోజులుగా కురిసిన వర్షాలకు ఆర్టీసీ బస్టాండ్ వెను ఉన్న హమాలీకాలనీ పూర్తిగా వర్షం నీటితో పూర్తిగా మునిగిపోయిందన్నారు. దీంతో కాలనీ చుట్టూ రహదారులన్నీ మూసుకుపోయాయన్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించకపోవడంతో కాలనీవాసులతో కలిసి ధర్నా చేపట్టినట్లు తెలిపారు. తక్షణమే కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా వర్షం నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, జ్ఞానమూర్తి, వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు ఓబులేసు, శ్రీకాంత్, అబ్బాస్, రాము, హమాలీ కాలనీవాసులు లోకేష్, వెంకటేష్, ఆనంద్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్‌గా షఫీ

వజ్రకరూరు : ఉమ్మడి అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం ఎపిహెచ్ఎఎంఎస్ఏ జిల్లా కన్వీనర్‌గా ఉరవకొండ మండలం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పని చేస్తున్న ఎస్ఎండి షఫీ నియమితులయ్యారు. అనంతపురంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఎపి హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా షఫీ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తామన్నారు. అలాగే ఉద్యోగుల సమస్యలు పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులు మల్లేపల్లి పామన్న, రఘుబాబు, సయ్యద్, షఫీ, శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శ్రీవారి సూర్యప్రభ వాహనసేవ

వజ్రకరూరు : పెన్నోబిలంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సనాతన హైందవ సంప్రదాయంలో సూర్యారాధనకు విశేష ప్రాధాన్యత ఉంది. ప్రత్యక్ష దైవమైన సూర్యనారాయణుని ఆదిమధ్యాంత రహితుడిగా పేర్కొంటారు. సూర్యారాధన వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ వాహనంలో స్వామివారిని దర్శించుకుంటే మంచి ఆరోగ్యం ప్రసాధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కాగా సాయంత్రం ఐరావతం వాహనంపై ఊరేగారు. ఈ కార్యక్రమంలో ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథ్‌స్వామి, బాలాజీస్వామి, గుండురావు, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో నర్సుల సేవలు ఆదర్శం

మాట్లాడుతున్న వక్తలు

అనంతపురం : సమాజంలో నర్సుల బాధ్యత అత్యంత కీలకమని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం నగర శివారులోని ఆదర్శ నర్సింగ్ కళాశాలలో కళాశాల దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ నర్సింగ్ కళాశాలలో ఆదర్శవంతమైన విద్యను అందిస్తున్నామన్నారు. కోర్సు ముగిసిన విద్యార్థినులు ప్రతి ఒక్కరూ సేవను తమ అజెండాగా భావించాలని పిలుపునిచ్చారు. నేటి సమాజంలో సేవకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. కోవిడ్ లాంటి విపత్కరమైన సమయంలో కూడా ప్రజలకు సేవ చేసిన ఘనత వైద్య ఆరోగ్యశాఖదని తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సతీష్‌కుమార్ యాదవ్, రేవంత్‌యాదవ్, ప్రిన్సిపాల్ యామిని, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలి

శింగనమలలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

శింగనమల : ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు మండల కేంద్రంతోపాటు చిన్న మట్ల గొంది, పెద్దమట్లగొంది గ్రామాల్లో సిఆర్‌పిఎఫ్ బలగాలతో సోమవారం కవాతు నిర్వహించారు. మండల కేంద్రంలో స్థానిక ఎస్సీ కాలనీ నుంచి దర్గా సర్కిల్ మీదుగా బస్టాండ్, పోలీస్‌స్టేషన్ వరకూ సాగింది. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ వచ్చేనెల 4న ఎన్నికల కౌంటింగ్ నిమిత్తం ముందస్తు చర్యల్లో భాగంగా ఎలాంటి ఘర్షణలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా కవాతులు, ముందస్తు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేకమైన పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చితంబరం, సిబ్బంది బాషా, సాయి, అంజన్‌రెడ్డి, ధనుంజయ, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు : సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ హేమాద్రి సూచించారు. సోమవారం సాయంత్రం పుట్లూరులో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాకాకుండా గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫలితాల అనంతరం ఏ పార్టీ గెలిచినా సామరస్యంగా ఉండాలన్నారు. అలాకాకుండా టపాసులు పేల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, అల్లర్లు చేయడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

25,579 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ పంపిణీ

అనంతపురం : జిల్లావ్యాప్తంగా సోమవారం నాటికి 58,359 మంది రైతులకు 25,579 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ పంపిణీ చేసినట్లు డిఎఒ ఉమామహేశ్వరమ్మ, సాంకేతిక వ్యవసాయ అధికారి రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

టిడిపి జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

శింగనమల : అనంతపురం జిల్లా టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వెంకట శివుడుయాదవ్‌ను నియోజకవర్గ టిడిపి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సిఎంగా చంద్రబాబు అసెంబ్లీలో అడుగు పెడతాడన్నారు. నియోజకవర్గంలో కష్టపడి వారికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బండమీదపల్లి కాయల రమణయాదవ్, ముచ్చుకోట శివయ్య, దాల్ వీరనారాయణ, తలారి ఆదినారాయణ, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ, వీరేశలింగం పంతులకు నివాళి

గుత్తి : పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, కందుకూరి వీరేశలింగం వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక పెన్షనర్ల భవనంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా ఉపాధ్యక్షులు స్వర్ణం, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయప్ప, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు శామ్యూల్, వెంకటేష్, నారాయణరెడ్డి, గోవిందప్ప, షేక్షావలి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మన్రోకు...

గుత్తి : దత్త మండలాల మొట్టమొదటి కలెక్టర్ సర్ థామస్ మన్రో 263వ జయంతి సందర్భంగా సోమవారం గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి వై.రాజశేఖర్‌రెడ్డి, నాయకులు గైడ్ రమేష్, కాశీరావు, చిరంజీవి, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

అనంతపురం : నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో పేద మహిళలకు సోమవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాట్స్ ఛైర్మన్ ప్రశాంత్, అధ్యక్షులు బాపయ్యచౌదరి మాట్లాడుతూ ఉత్తర అమెరికా తెలుగు సంఘం తెలుగు రాష్ట్రాలలో అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే కరువు జిల్లాలో స్వశక్తితో బతికే మహిళలు, నిరాదరణకు గురైన మహిళలను గుర్తించి కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

జాతీయ స్కేటింగ్‌లో హేత్వికరెడ్డి ప్రతిభ

ప్రతిభ కనబరిచిన హేత్వికరెడ్డి

అనంతపురం : జాతీయ ర్యాంకింగ్ ఓపెన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో అనంతపురం హౌసింగ్ బోర్డుకు చెందిన హేత్వికరెడ్డి ప్రతిభ కనబరిచింది. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకూ గోవాలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొని కాంస్య పథకం సాధించింది. జాతీయస్థాయిలో పోటీ పడి పథకం సాధించడం పట్ల పలువురు అభినందించారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

అనంతపురం : సాధారణ ఎన్నికల దృష్ట్యా నగరంలోని జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను అనంతపురం వైసిపి ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ సోమవారం పరిశీలించారు. ఈయనతోపాటు ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, సీనియర్ నాయకులు మిద్దె కుళ్ళాయప్పతో కలిసి పలు అంశాలపై చర్చించారు.

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం : అనంతపురం విజిలెన్స్, ఎంఫోర్సుమెంట్ ఆఫీసర్ ఎస్.మాసూమ్‌బాషా ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని విత్తన దుకాణాలపై ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా భవానీ ఏజెన్సీస్, అమరావతి హైబ్రిడ్ సీడ్స్ దుకాణాల్లో భౌతిక నిల్వలు, స్టాక్‌లో వ్యత్యాసాలు రావడంతోపాటు స్టాక్‌బోర్డు, రిజిస్టర్లను సరిగా నిర్వర్తించక పోవడం గుర్తించారు. దీంతో సుమారు రూ.1,35,360 విలువజేసే స్టాక్‌కు సంబంధించి నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ కె.శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ అధికారి జె.వాసుప్రకాష్, ఎంఎఒ శశికళ, తదితరులు పాల్గొన్నారు.

బీ.ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బీ.ఫార్మసీ 1వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్23) రెగ్యులర్, బీ.ఫార్మసీ 1వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ, బీ.ఫార్మసీ 1వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం వెబ్‌సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

మృతిచెందిన ఓబులేసు

అనంతపురం క్రైం : అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక నారాయణపురంలో చోటుచేసుకుంది. 4వ పట్టణ సీఐ ప్రతాపరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వరికూటి ఓబులేసు నారాయణపురం పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటూ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం కోసం పలువురి వద్ద అప్పులు చేశాడు. అప్పుల వారి వేధింపులు అధికం కావడంతో సోమవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటోడ్రైవర్ ఇంట్లో చోరీ

గుంతకల్లు : స్థానిక సత్యనారాయణపేటలోని వాల్మీకి నగర్ కాలనీలో నివసిస్తున్న ఆటోడ్రైవర్ రాజశేఖర్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆటో డ్రైవర్ రాజశేఖర్ కుటుంబంతో కలిసి బళ్లారికి వెళ్లారు. ఇంట్లోని కింద పోర్షన్ బాగుడకు ఇచ్చి పైన పోర్షన్‌లో రాజశేఖర్ కుటుంబం ఉంటోంది. ఈ నేపథ్యంలో కింద బాడుగకు ఉన్న సలీంబాషా ఇంటికి బయట గడి పెట్టి పైఅంతస్తులో ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. సలీం ఉదయం లేవగానే డోర్ తలుపులు తెరుచుకోకపోవడంతో కిటికీలో నుంచి బయట వ్యక్తులను పిలిచి గడియ తీపించుకున్నారు. తర్వాత పై అంతస్తులోకి వెళ్లి చూడగా రాజశేఖర్ ఇంటి తాళం పగలగొట్టి బీరువా తెరిచి ఉండడం గమనించి రాజశేఖర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. సాయంకాలానికి ఇంటికి చేరుకున్న రాజశేఖర్ కసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన ఇంట్లోని బీరువాలు రూ.25వేల నగదు, జత కమ్మలు ఉన్నట్లు ఫిర్యాదులు పేర్కొన్నారు. కసాపురం స్టేషన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

21 మంది బైండోవర్

పుట్లూరు : 4న సాధారణ ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పలువురిని సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. మండలవ్యాప్తంగా 21 మందిని బైండవర్ చేసి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మల్లికార్జునస్వామి ఎదుట హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

అనంతపురం క్రైం: ఆదివారం ఉదయం 2వ రోడ్డు ఫ్లైఓవర్ కింద జరిగిన హత్య కేసులో నిందితుడు శ్రీనివాస్ నాయక్ ను అరెస్టు చేసినట్లు త్రీ టౌన్ సీఐ ధరణీ కిషోర్ తెలిపారు. హత్య చేసి పరారైన శ్రీనివాస్ నాయక్ సోమవారం సాయంత్రం స్థానిక బళ్ళారి బైపాస్ సమీపంలోని ఎంజీ పెట్రోల్ బంక్ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.